# పోలింగ్ లో ప్రిసైడింగ్ అధికారులే కీలకం




- **ఎంపీడీవో శ్రీనివాసరావు**

**టీ మీడియా, అక్టోబర్ 08, సింగరేణి (కారేపల్లి):** పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్రే కీలకమని సింగరేణి మండల ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అన్నారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడిరగ్ అధికార్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పోలింగ్ రోజు పీవో, ఏపీవోలు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు ఇచ్చే ఫారాలు, నివేదికలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి ప్రతీ విషయంలో చాలా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ రోజు జాగ్రత్తగా సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ అనంతుల రమేష్, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, మాస్టర్ ట్రైనీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేసమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

**టీమీడియా, అక్టోబర్ 8, కొల్లాపూర్ :** బీఆర్ఎస్ గూటికి వలసల పరంపర మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో అధికార పార్టీకి చెందిన పలువురు కారెక్కుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లికి చెందిన 20 మంది కాంగ్రెస్ నాయకులు బుధవారం కొల్లాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో కారెక్కారు. వీరికి బీరం గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్యారెంటీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయా లన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు సమిష్టిగా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

# పిచ్చికుక్కల స్వైరవిహారం

- **నాగర్‌దొడ్డిలో 8 మందికి గాయాలు**

**టీమీడియా, అక్టోబర్ 8,మల్దకల్ :** పిచ్చికుక్కల దాడిలో పలువురికి గాయాలైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మల్దకల్ మండలం నాగర్‌దొడ్డిలో బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెండు పిచ్చి కుక్కలు స్థానికులపై దాడి చేశాయి. ఎస్సీ కాలనీ వరకు రెండు కుక్కలు స్వైరవిహారం చేయడంతో తిమ్మప్ప, అమీర్ కూతరు యాస్మిన్, శాన్వి, ప్రమోద్‌తో పాటు మరో నలుగురిని కరిచాయి. వీరందరూ గద్వాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మొత్తం 500 కుక్కలు ఉన్నాయని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# సీఎం సొంతూరు మీదుగా రైల్వేలైన్!






- **వేగంగా కల్వకుర్తి-మాచర్ల పనులు**

**టి మీడియా, అక్టోబర్ 8, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల మధ్య నూతన మార్గంలో రైల్వే అనుసంధానత కోసం ప్రతిపాదిత కల్వకుర్తి–మాచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన చర్యలు వేగవంతం అవుతున్నాయి. దీని ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రైల్వే బోర్డుకు దక్షిణ మధ్య రైల్వే లేఖ రాసింది. ముందుగా ఈ ప్రాజెక్టు దూరం 100 కిలోమీటర్లు ఉండగా, అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు. అయితే తాజా ఎలైన్?మెంట్?తో ఈ దూరం కాస్త పెరిగి 126 కిలోమీటర్లు అయింది. దీంతో అంచనా వ్యయం రూ.2,520 కోట్లకు పెరిగింది. ఈ లెక్కన ఒక్కో కిలోమీటర్‌కు రూ.20 కోట్లు ఖర్చు అవుతుంది. తెలంగాణలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల వరకు ఈ రైల్వే ప్రాజెక్టును మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జులైలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో దక్షణ మధ్య రైల్వే నుంచి రైల్వే బోర్డుకు లేఖ వెళ్లింది. కల్వకుర్తి–మాచర్ల ప్రతిపాదిత ప్రాజెక్టు మార్గంలో సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి కూడా ఉంది. ఈ లేఖతో కల్వకుర్తి మాచర్ల ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)కు, ప్రాజెక్టు నిర్మాణ దిశగా కీలక ముందడుగుపడే అవకాశం ఉంది. ఎక్కడెక్కడ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాలి. ఈ మార్గంలోని భౌగోళిక పరిస్థితులు, ఇంజినీరింగ్ అంచనాలను ఖరారు చేసే తుది దశే ఫైనల్ లొకేషన్ సర్వే.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఊతం ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే 100 శాతం నిధులతో చేపట్టాలని సీఎం కోరారు. కల్వకుర్తి–మాచర్ల మార్గానికి ఎఫ్?ఎల్?ఎస్? మంజూరై ఆ తర్వాత కేంద్రం నిధులిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కి తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, వ్యాపారం, పర్యాటకరంగాలకు ఊతం లభిస్తుంది. కల్వకుర్తితో పాటు దేవరకొండ, మల్లేపల్లి, చలకుర్తి వంటి ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ వస్తుంది. తెలంగాణ నుంచి మాచర్ల మీదుగా గుంటూరుకు రైలు మార్గం అనుసంధానం అవుతుంది. ఇది తెలంగాణ, ఏపీ మధ్యలో మరో కీలక మార్గం అవుతుంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆమోదం కోసం ఏపీ ప్రభుత్వంతోనూ మాట్లాడాలని తెలంగాణ సర్కారు నిర్ణయించినట్లు సమారం.

**ఎలైన్‌మెంట్ ఇలా**

కల్వకుర్తి నుంచి కొండారెడ్డిపల్లి – వంగూరు – కందుకూరు – దేవరకొండ – మల్లేపల్లి – పెద్దఅడిశర్లపల్లి – చలకుర్తి – నెల్లికల్ – విజయపురి (నాగార్జునసాగర్ సమీపం) – కొత్తూరు మీదుగా మాచర్ల వరకు ఉంటుంది.

**మహబూబాబాద్‌లో మెగా మెయింటెనెన్స్ డిపో**

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని తెలుగు రాష్ట్రాల్లో సరుకు రవాణా రైళ్ల నిర్వహణ సదుపాయాల విస్తరణ, కొత్తగా మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు రూ.1,361 కోట్లు విలువైన నిధులు మంజూరయ్యాయి. 'అంబ్రెల్లా వర్క్స్' కింద మంజూరు చేస్తూ ద.మ.రైల్వే మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్‌లో రూ.908.15 కోట్లతో 'మెగా మెయింటెనెన్స్ డిపో' ఏర్పాటు చేయనున్నారు. దీంతో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్, రెగ్యులర్ ఓవర్‌హాలింగ్, సిక్‌లైన్, ట్రైన్ ఎగ్జామినేషన్ వంటి కీలకమైన సదుపాయాలు రానున్నాయి. ద.మ.రైల్వేజోన్‌లో ఈ తరహా మెగా మెయింటెనెన్స్ డిపో రావడం ఇదే తొలిసారి.

# సీఎం, ఇతర మంత్రులు స్పందించాలి

- **ఖమ్మం రేవా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వినతి**

**టీమీడియా, ఖమ్మం:** 30 , 40 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగం చేసి అన్ని వర్గాల ప్రజలకు తమ వంతు సహకారం అందించిన తమకు ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడారు. రిటైర్డ్ అయి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి బకాయిలు చెల్లించకపోవడం వల్ల తమ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం, విద్య, ఈఎంఐ, ఆసుపత్రి ఖర్చులు తదితర సమస్యలతో తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక వారి వేదింపులు తట్టుకోలేక మనోవేదన గురవుతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.




తమవి గొంతెమ్మ కోరికలు కావని ఆర్థిక సమస్యలు జీవన్మరణ సమస్యగా మారాయన్నారు. జిపిఎఫ్, ఈ ఎల్ తదితర ఆరు రకాలుగా బకాయిలు ఉన్నాయని అందులో రెండు రకాల మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని మిగిలిన నాలుగు రకాలు తమ వేతనంలో నుంచి కట్ చేసుకుని ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అందజేస్తారని తెలియజేశారు. తమ వద్ద కట్ చేసిన సొమ్మును కూడా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్లో పెట్టడం దారుణమన్నారు. అనారోగ్యం మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నా యన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13000 మంది ప్రభుత్వ ఉద్యోగం విరమణ చేసిన వారున్నారు. పెన్షన్ బకాయిలను నెలకు 1000 కోట్ల చొప్పున విడుదల చేయాలని వారు వేడుకుంటున్నారు. తాము ఎవరికి వ్యతిరేకం కాదని రోజు రోజుకు క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితిలపై తమ ఆవేదనను వ్యక్తం చేసామని వారు తెలిపారు.

ప్రెస్ క్లబ్ సమావేశంలో 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) అధ్యక్షుడు సింగారపు జయరాం, ప్రధాన కార్యదర్శి మువ్వల భారతి, రామారావు, లక్ష్మయ్య, నాగేందర్, రామకోటేశ్వరరావు, గోవిందరావు, కృష్ణారావు అంబటి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.